క్లుప్తంగా

రాహుల్‌గాంధీ, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మపురి: రైతులకు రుణమాఫీ చేయడంపై శనివారం రాజారాంలో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎదులాపురం మహేందర్‌చారి, నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కాశయ్య, బాపు, జెల్ల సత్తయ్య, హనుమండ్లు, శంకర్ తదితరులున్నారు.

ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు నిలిపేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్

కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ రోడ్‌లో వేంకటేశ్వర ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని వీటిని నిలిపివేయాలని బీజేపీ కౌన్సిలర్ పెండెం గణేశ్ శనివారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతికి ఫిర్యాదు చేశారు. ఇంతకుముందు ఆలయ స్థలం కబ్జా అయ్యిందని పేర్కొన్నారు. ఆలయ భూముల సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని కోరారు.

బాల్య వివాహాలతో నష్టం

జగిత్యాలరూరల్: బాల్య వివాహాలతో బాలికలు ఆరోగ్యంగా నష్టపోతారని మహిళ సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బేటి బచావో బేటి పడావో పథకం, మహిళల హక్కుల గురించి వివరించారు. అనంతరం అశ్విని మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. బాల బాలికలకు ఏదైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గంగాధర్, టీమ్ మెంబర్స్ గౌతమి పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పెగడపల్లి: పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్లాంటేషన్, శానిటేషన్, సీజనల్ వ్యాధులు, దోమల నివారణ, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. డ్రెయినేజీలు, తాగునీరు ట్యాంకులు క్లీనింగ్, ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి బావుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్యాల: మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మహిళలకు మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మండలంలోని ముత్యంపేటలో మహిళలకు వివిధ అంశాలను వివరించారు. ఆపద సమయాల్లో సీనియర్ సిటీజన్స్ రక్షణ చట్టం, హెల్ప్‌లైన్ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వప్న, హేమశ్రీ, శారద పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో

మెట్‌పల్లిరూరల్: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాడని మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పంచాయతీ కార్యదర్శి ఆసీఫ్‌కు మండల పరిషత్ అధికారులు శనివారం మెమో జారీ చేశారు. రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాల్సిందిగా అధికారులు పేర్కొన్నారు. లేనిపక్షంలో పంచాయితీరాజ్ చట్టం–2018 ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

నిండుతున్న కుంటలు, చెరువులు



తాళ్ల ధర్మారంలోని అరగుండాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లుతున్నాయి. గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీటి మట్టం పెరిగాయి.

సారంగాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు కుంటలు, చెరువులు శనివారం నిండి మత్తడులు పొర్లిపొరుతున్నాయి. గడచిన రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు బీర్‌పూర్ మండలంలోని చెర్లపల్లి ఊరచెరువు, కండ్లపల్లి గంటన్న చెరువు, ఊరచెరువు, తాళ్ళధర్మారం గ్రామ శివారుల్లోని అరగుండాల ప్రాజెక్టులు నిండి దిగువకు నిండిపారుతున్నాయి. సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి గ్రామ శివారుల్లోని మునీశ్వరుల చెరువు, పటేళ్ల కుంట, ఆసిరెడ్డికుంట, మిట్టపల్లి కుంట, సుంకరోళ్ల కుంట, రంగపేట గ్రామ శివారుల్లోని ఊరచెరువులు నిండి మత్తల్లు దూకుతున్నాయి. కాగాబీర్‌పూర్ గ్రామ శివారుల్లోని రోళ్లవాగు ప్రాజెక్టులోకి ఎగువ నుండి వాగుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 18 అడుగులు కాగ, ప్రస్తుతం ప్రాజెక్టులో ఆరు అడుగులకు నీరు చేరింది. కాగా రెండు మండలాల్లోని కుంటలు, చెరువులను డీఈ చక్రూనాయక్, ఏఈ అనిల్, సూపర్‌వైజర్ మోహన్‌లు పరిశీలించారు.

కోరుట్లలో ఎడతెరిపి లేని వర్షం

కోరుట్లరూరల్: పట్టణంతో పాటు మండలంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దుకాణాలకు, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలకు, కార్యాలయాలకు వెల్లేందుకు ప్రజలు, పాఠశాలలకు వెల్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. 25.5 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మల్లాపూర్: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి వరకు 3.8 మీ.మీ, భారీవర్షం కురిసిందని సహాయ గణాంకాధికారి(ఏఎస్‌వో) శ్రీనివాస్ తెలిపారు. ఈ భారీవర్షానికి మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లాయి. కాగ మల్లాపూర్‌లో స్థానిక పెద్ద చెరువు పూర్తిగా నిండి మత్తడి దుంకుతోంది. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గోదావరినది, పెద్దవాగు తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వీర్‌సింగ్, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

గంజాయి, డ్రంకెన్ డ్రైవ్ నివారణపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ అశోక్‌కుమార్



కథలాపూర్ పీఎస్ ఆవరణలో ఎస్పీ, పోలీసులు

కథలాపూర్: గంజాయి, గుడుంబా, డ్రంకెన్ డ్రైవ్ నివారణపై పోలీస్ సిబ్బంది, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలను అరికట్టాలన్నారు. గ్రామాల్లో కొత్త చట్టాలపై, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ వెంట మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్ రావు, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు.

గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు సహకరించాలి

మెట్‌పల్లి: జగిత్యాలను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రజలు సహకరించాలని ఎస్పీ అశోక్‌కుమార్ కోరారు. పట్టణంలోని నరేంద్ర జూనియర్ కళాశాలలో శనివారం మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. సమాజం నుంచి యువత మంచిని మాత్రమే స్వీకరించాలని, చెడు వ్యసనాలకు ఎట్టి పరిస్థితుల్లోను ఆకర్షితులు కావద్దన్నారు. ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాధించడంపైనే దృష్టి సారించాలని, మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉమమాహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్, కిరణ్, నవీన్, శ్యామ్‌రాజ్ తదితరులున్నారు.

యువత 'మత్తు' పదార్థాలకు దూరంగా ఉండాలి

జగిత్యాల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ముకేశ్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువత మత్తుకుబానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, విజయలక్ష్మి, కళాశాల బృందం పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి కోసం రూ.30 లక్షలు మంజూరు

రాయికల్: పట్టణంలోని హనుమాన్ ఆలయానికి, కొత్తపేట, సింగరావుపేట గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధి కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు కాగా, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ప్రొసిడింగ్ కాపీలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, కౌన్సిలర్లు, నాయకులుపాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

రాయికల్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో చిరంజీవి అన్నారు. శనివారం మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటి ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం





కథలాపూర్ మండలం సిరికొండ,ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో చిన్నారులకు అక్షరాభ్యాసం

మెట్‌పల్లిరూరల్/కథలాపూర్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట – అంగన్‌వాడీ బాట నిర్వహించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాస్యం చేయించారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో 'అమ్మ మాట– అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.ఇబ్రహీంపట్నం మండంలోలని అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ, వేములకుర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఎంపీడీవో సందర్శించారు. మల్లాపూర్ మండలంగుండంపల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లు, కారొబార్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

పెగడపల్లి: రైతుబీమా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ఇప్పటివరకు పట్టాదారు పాసు పుస్తకం ఉండి దరఖాస్తు చేసుకోని వారితో పాటు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆగస్టు 5లోపు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, నామిని ఆధార్‌కార్డుల జిరాక్స్ ప్రతులను రైతు బీమా దరఖాస్తు ఫాంనకు జతపరిచి సంబంధిత క్లస్టర్ పరిధిలోని ఏఈవోలకు అందించాలని వారు సూచించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వెల్గటూర్ : పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం వెల్గటూర్‌లో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8న సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వానికి లేఖ రాయగా స్పందించిన ప్రభుత్వం మే నెల వరకు 150 కోట్ల పై చిలుకు గ్రాంటు విడుదల చేస్తూ ఈ నిధులను కేవలం వేతనాలకు మాత్రమే వినియోగించాలని సర్క్యులర్ విడుదల చేసింది. అయినా ఇప్పటి వరకు కార్మికులు వేతనాలు విడుదల చేయకపోవడంతో, తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు గాజుల రాజయ్య పోచయ్య, లింగయ్య, రాజయ్య, గంగయ్య, భూమయ్య, గంగారాం, మల్లయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మూడో తరగతి సమంజసం కాదు

జగిత్యాల: అంగన్‌వాడీలను ప్లేస్కూళ్లుగా మార్చి మూడో తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సమంజసం కాదని, దానిని విరమించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌సుందర్, భూమేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించడం లేదని, 1,2,3 తరగతులు అంగన్‌వాడీలకు అప్పగిస్తే మూసివేతకే దోహదపడుతుందన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమిరెసిడెన్షియల్‌గా మార్చాలనే ఆలోచన ఆహ్వానించదగినదని, ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతికొక టీచర్ ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల పోషణ బాధ్యత విస్మరిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో కార్యాలయ ఏవో హుస్సేన్

జగిత్యాల: వయోవృద్ధుల పోషణ బాధ్యత విస్మరిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో కార్యాలయ ఏవో తఫజుల్ హుస్సేన్ అన్నారు. శనివారం ఆర్డీవో మధుసూదన్ ఆదేశాల మేరకు కేసులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు అన్ని వసతులు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. కొడిమ్యాల మండలం రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన మల్లవ్వను కుమారుడు ఇంటి నుంచి గెంటివేయగా వారిని మందలించారు. గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు చెందిన శాంతవ్వను పట్టించుకోకపోవడం, జగిత్యాల పట్టణానికి చెందిన సత్యనారాయణను చిన్నకూతురు వేధింపులకు గురిచేస్తున్నారని ట్రిబ్యునల్‌లో పేర్కొనడంతో విచారణ చేపట్టారు. వయోవృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సెక్షన్ 2007 సెక్షన్ 24 ప్రకారం ఆరునెలల వరకు జైలుశిక్షతో పాటు, జరిమానా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, పద్మజ పాల్గొన్నారు.

విద్యార్థుల ఏకాగ్రతకు సానుకూల వాతావరణం కల్పించాలి

కోరుట్ల: విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత హోమ్ వర్క్ చేసుకునేందుకు ఇంట్లో సానుకూల వాతావరణం కల్పించాలని పట్టణంలోని బాలుర హైస్కూల్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుతో పాటు ఇంట్లో చేపించవలసిన పనులపై తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముజఫర్ రహేమాన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నల్ల వనిత, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోదావరి తీర ప్రాంతాలకు వెళ్లొద్దు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శనివారం కడెం ప్రాజెక్టు అధికారులు ఓ ప్రకటన జారీ చేశారు. గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఎవరూ కూడ గోదావరిలోకి వెళ్లవద్దని ఈ మేరకు కడెం ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

రాయికల్: నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేయడంతో మండలంలోని బోర్నపల్లి, జగన్నాథపూర్ గ్రామాల్లోని గోదావరి తీర ప్రాంతాల రైతులు, మత్స్యకారులు, యాదవులు ఎవ్వరూ వెళ్లవద్దని తహసీల్దార్ ఖయ్యూం శనివారం తెలిపారు.

ధర్మపురి (బుగ్గారం) : భారీ వర్షాలతో జాగ్రత్తలు, సూచనలు విధిగా పాటించాలని బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వాటిలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని,వాహనాలను అతి వేగంగా నడుపరాదని, వరదలు ప్రవహిస్తున్నప్పుడు అత్యుత్సాహంతో దాటే ప్రయత్నం చేయరాదని కోరారు.



మెహందీ వేడుకల్లో చైర్‌పర్సన్ జ్యోతి, మహిళలు

గోరింటాకు సంబరం

జగిత్యాల/జగిత్యాలటౌన్: ఆషాడమాసం పురస్కరించుకుని శ్రీ లోకమాత పోచమ్మతల్లి ఆలయంలో, మున్సిపల్ కార్యా లయంలో శనివారం గోరింటాకు సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని లాస్య పాఠశాలలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా గోరింటాకును చేతులకు పెట్టుకున్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: ముదిరాజ్ కులస్తులను బీసీ ఏలో చేర్చాలని శనివారం తహసీల్దార్ ప్రసాద్‌కు ముదిరాజ్ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్లు నిండిన ముదిరాజ్ కులస్తులకు పింఛన్ ఇవ్వాలని, ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం, 100 శాతం మత్స్యకారులకు చేరే విధంగా చూడాలని, రాజకీయ రంగంలో ముదిరాజ్ కులస్తులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, కార్పొరేషన్లలో ముదిరాజులను చైర్మన్లుగా నియమించాలని విన్నవించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు తోకల రాజేశ్వర్, రాంబాబు, జిల్లా అధ్యక్షుడు నీలం పెద్దులు, నాయకులు నేమూరి సత్యనారాయణ, చెగొండ శ్రీనివాస్, పిట్టల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామానికి చెందిన పంజాల సత్యనారాయణగౌడ్(52) అనే వ్యక్తి ఓమన్ దేశంలో ఈనెల 2న గుండెపోటుతో మృతిచెందగా, మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. సత్యనారాయణగౌడ్ రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఓమన్ దేశం వెళ్లారు. అక్కడ మస్కట్ పట్టణంలో కార్మికుడిగా పనిచేసేవారు. ఈనెల 2న రాత్రి విధులు ముగించుకుని తన గదికి వెళ్లగా.. గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్ల బుచ్చిమల్లు శనివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. బాధితుడిని కుటుంబ సభ్యులు జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

రాయికల్: పట్టణంలోని సత్య హాస్పిటల్, కరీంనగర్ మెడ్‌కవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.గుండె వైద్యనిపుణులు డాక్టర్ సుశీల్, జనరల్ ఫిజిషియన్ అందె ఉదయ్‌కుమార్, 150 మందికి పరీక్షలు నిర్వహించారు. ఎస్సై అశోక్, మున్సిపల్ చైర్మన్ మోరహన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరు

పెగడపల్లి:మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాలల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు.

దాడి ఘటనపై విచారణ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహాస్వామి దేవస్థానంలో శుక్రవారం ఓ భక్తుడిపై దేవస్థానం సిబ్బంది దాడి చేశారని వచ్చిన వార్తలపై దేవస్థానం ఈవో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. అన్నదాన సత్రంలో దొడ్డు అన్నం పెడుతున్నారని భక్తుడు అడగడంతో భక్తుడు, దేవస్థానం సిబ్బంది మధ్య గొడవ జరిగి, సిబ్బంది దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై పల్నాడు జిల్లా దాచెపెల్లికి చెందిన సత్యనారాయణ అనే భక్తుడిని ఈవో శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. అన్నదాన సత్రంలో భక్తుడు సిబ్బందిపై దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించాడని, సిబ్బంది దాడి చేయలేదని ఈవో ముందు వివరించాడు. భక్తుడిపై సిబ్బంది దాడి అవాస్తమని, భక్తుల పట్ల సిబ్బంది ఎప్పుడు మర్యాదపూర్వకంగా ఉంటారని ఈవో తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం పలువురు సన్మానించారు. 7వ తరగతి విద్యార్థి సల్వాల ముత్యం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రన్నింగ్ ఈవెంట్‌లో చక్కని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి సైన్స్ ఫోరం నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో బి. హంసిని మండల టాపర్‌గా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థులను మాజీ ఎంపీటీసీ పానకంటి వెంకట్, మాజీ ఉపసర్పంచ్ మంగినిపెల్లి లక్ష్మణ్, ఉపాధ్యాయులు సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నేషనల్ గ్రీన్ కార్ప్స్ తెలంగాణ, కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో ఎల్ఈడీ ట్యాబ్లెట్స్‌ను సొంతంగా తయారు చేసి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు శనివారం ప్రశంసా పత్రాలు అందించారు. విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం సూర్యప్రకాశ్, గైడ్ టీచర్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు ఆనందరావు, పద్మ, విద్యాదేవి, శ్రీనివాస్, హరిత, అరుణ అభినందించారు.



పొలం మడి కాదు.. రెండు జిల్లాలు కలిపే రోడ్డు

కథలాపూర్: ఇదీ కథలాపూర్ మండలం భూషణరావుపేట నుంచి నిజామాబాద్ జిల్లా భీంగల్ వెళ్లే రోడ్డు. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రోడ్ల భవనాలశాఖ అధికారులు 8 నెలల క్రితం పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయమై పొలం మడిలా తలపిస్తోంది. ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు మండిపడుతున్నారు. రాత్రి వేళల్లో ఈరోడ్డు పై వెళ్లేవారు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చొరవ చూపి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.